# కన్నెదెయ్యం

**గురజాడ శోభాపేరిందేవి**

హోరున వాన కురుస్తోంది.

విశాలమైన కాంపౌండ్‌లో ఉన్న అశోక వృక్షాలు కదుల్తున్నాయి. అవి కదుల్తున్న తీరు చూస్తే, రమణారెడ్డి లాంటి మనిషి, చలికి వణుకు తున్నట్లుంది అనిపిస్తుందేమో పగటివేళ చూస్తే. కానీ ఇప్పుడు మాత్రం నా కళ్లకి అది బక్కపల్చటి దెయ్యం భయపెడూ కదుల్తున్నట్లుగా అనిపిస్తోంది.

నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది.

దెయ్యమా? ఓ దెయ్యమా?? ఓహో దెయ్యమా???

"ఈ ఇంట్లో నువ్వున్నావన్నారు. నీ అడుగుల సవ్వడులు వినిపిస్తాయన్నారు. నువ్వు పీడిస్తావన్నారు. పీక్కుని తింటావన్నారు. అదంతా నిజమో అబద్ధమో తేలాలంటే నీ దర్శన భాగ్యం కలగాలే దెయ్యమా? దయచేసి కనిపించవే దెయ్యమా!"

నిశ్శబ్దంలో నిద్రిస్తూ ఉన్న ఇల్లు నా అరుపుతో ప్రతిధ్వనించింది పరిసరాలను మేలుకొలుపుతున్నట్లుగా.

కానీ జవాబు లేదు.

గట్టిగా నవ్వాను.

గబుక్కున కరెంట్ పోయింది.

తారు డబ్బా తన్నేసినట్లుగా ఉంది చీకటి.

కొవ్వొత్తి వెలిగించి ఇల్లంతా కలియ తిరగాలనుంది దెయ్యం ఉనికి కనిపెట్టేందుకు.

కానీ అసలు కొవ్వొత్తి ఉందో లేదో గుర్తే లేదు. నాకు గుర్తున్నదల్లా ఒక్కటే!

ఈ ఇంట్లో దెయ్యం ఉంది!

లేచి నిలబడి నా చేతిలో ఉన్న పుస్తకాన్ని టేబుల్ మీద పడేసాను.

కిర్రుమన్న చప్పుడైంది.

"గాలికి కిటికీ రెక్క కదిలినట్లుంది" నిర్లక్ష్యంగా అనుకున్నాను.

పెద్ద ఎత్తున గాలి వీచింది.

ఆ గాలికి దగ్గరగా వేసి వున్న వీధి తలుపులు తెరుచుకున్నాయి.

చలిగాలి రివ్వున వీచింది. వెన్నులోంచి చలి మొదలైంది.

రగ్గు కప్పుకుని కూర్చుందామని అనుకుంటూ మంచం వైపుకు నడిచాను.

నాకు ఇల్లే కొత్త. దానికి తోడు కరంట్ లేదు. తడుముకుంటూనే మంచం సమీపించి రగ్గుని లాగబోయిన నేను కరెంట్‌షాకు కొట్టినట్లుగా ఆగిపోయాను.

నా రగ్గుని ఎవరో కప్పుకుని పడుకున్నారు.

"ఎవరది?" గట్టిగా అరిచానను కున్నాను కానీ నెమ్మదిగా పలికింది నా గొంతు.

ఎవరో గట్టిగా నవ్వారు.

అది ఆడదాని నవ్వు.

ఆ నవ్వులో కసి ఉంది.

నా గొంతు ఎండిపోతున్నట్లుగా అనిపించింది. మంచినీళ్లు తాగేందుకు తడుముకుంటూనే వంటింటికి నడిచాను.

కూజామీద పెట్టిన గ్లాసు అందుకుని దాంట్లో నీళ్లు ఒంచుకున్నాను.

గ్లాసు స్పర్శ అంతా విచిత్రంగా అనిపించింది. పట్టించుకోకుండా పైకెత్తాను.

తళుక్కున ఆకాశంలో మెరుపు మెరిసింది.



ఈవారం దెయ్యంకథ

ఆ మెరుపు వెలుగులో నా చేతిలో ఉన్న వస్తువు స్పష్టంగా కనిపించింది.

అది గ్లాసు కాదు పుర్రె.

నా కెందుకో ఇంక అక్కడ ఉండేందుకు ధైర్యం చాలలేదు. చెప్పు లేసుకోలేదు. తాళమూ పెట్టలేదు. వీధిలోకి పరుగు పెట్టాను.

అలా ఎంతో దూరం పరిగెత్తి వచ్చిన నేను ఆయాసంగా ఆగి చుట్టూ చూసాను.

అక్కడ పబ్లిక్ పార్కుంది. దాంట్లో కొద్దో గొప్పో జనం నిద్రపోతున్నారు.

నేనూ ఓ చోట చేరి నడుం వాల్చాను.

నిద్ర మాత్రం రాలేదు.

స్నేహితులతో ఛాలెంజ్ చెయ్యడం గుర్తొచ్చింది.

దెయ్యం ఉందని అంతా గట్టిగా నమ్మే ఆ ఇంట్లో నేను నాలుగు రోజులుంటే రోజుకి వంద చొప్పున నాలుగు వందలు ఇస్తానన్నాడు ఓ ధనికుడు. ఆ ధనిక మిత్రుడి నుండి నాలుగు వందలు రాబట్టడానికి వచ్చిన నేను, ఇలా ఓ గంటకే పారిపోయి వచ్చాను పక్కా పిరికిపందలాగ.

దయ్యాలు లేవన్న నా నమ్మకాన్ని అష్ట్రాల్ ఈ ఆడదయ్యం వమ్ము చేస్తోంది.

అంటే ఆడదాని చేతిలో తను చిత్తుగా ఓడిపోయాడన్న మాట.

ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రలోకి జారాను.

మెలుకువొచ్చే సరికి తెల్లారి పోయింది.

గబగబా ఇంటి వైపు నడిచాను.

వెల్తురు నా భయాన్ని వెళ్లగొట్టింది.

ఇంటిని సమీపించిన నేను ఉలికిపడ్డాను.

తలుపు తీసేసి కదా నేను వచ్చాను. కానీ లోపల గడియపెట్టుంది.

కొంపదీసి దొంగెవడైనా దూరాడా?

భయపడూ తలుపు కొట్టాను.

వెంటనే తీసిన చప్పుడైంది.

తీసిన దెవరా అని చూసాను.

ఎవ్వరూ లేరు.

గబగబా ఇల్లంతా తిరిగాను.

నిజంగా ఎవ్వరూ లేరు.

కానీ నాతో పాటు ఎవ్వరో ఇంట్లో తిరుగుతున్న ఫీలింగ్ కలగసాగింది.

ఆలోచించే ఓపిక లేదు.

టీ తాగడానికి నీళ్లు పడేసాను. ముఖం కడుక్కుని వచ్చాను.

టీ కలుపుకున్నాను.

ధన్‌మన్న చప్పుడైంది పక్కగదిలో

గబగబా అటు వెళ్లాను.

ఎవ్వరూ లేరు.

మళ్లీ వంటింట్లో కొచ్చి గ్లాసందుకున్నాను. టీ గ్లాసు ఖాళీగా ఉంది.

చచ్చినట్టు మళ్లీ పెట్టుకుని తాగాను.

తర్వాత తీరిగ్గా కూర్చుని ఆలోచించాను. 'నిజంగ దయ్యాలుంటాయా? ఉంటే ఎలా ఉంటాయి? చందమామ కథల్లోలాగ తోకల్తో ఉంటాయా? లేకపోతే సినిమాల్లో చూపించినట్లుగా, తెల్ల

చీరలు కట్టుకుని జుట్టు విరబోసుకుంటాయా?'

అవి లేవని ఋజువు చెయ్యాలనుంది.

కానీ ఎలా?

ఉన్నట్టే అనిపిస్తోంది.

నిజంగా ఉంటే నాటితో స్నేహం చెయ్యాలి అనిపించింది నాకు.

చందమామ కథల్లో మంచి దెయ్యాలు కూడా ఉంటాయని చదివాను కదా

నిజంగా ఈ దెయ్యం అలాంటిదైతే నా కోర్కెలన్నీ చకచకా తీరిపోతాయి.

ఈ దెయ్యాన్ని మంచి చేసుకోవాలంటే ఏం చెయ్యాలి?

ఆమెకీ గతి పట్టించిన వ్యక్తులని ఉరికంబానికి ఎక్కించాలి.

ఇంతకీ ఆమెకీ గతి పట్టించిన వారెవరో?

ఆలోచిస్తూనే స్నానాల గదికి వెళ్లాను తువ్వాలు తీస్కుని. చన్నీటి స్నానం తలమీదుగా చేస్తే హాయిగా అనిపించింది. గదిలో కొచ్చి బట్టలు కట్టుకున్న నేను ఉలిక్కిపడ్డాను.

అవి రక్తం మరకలతో నిండి ఉన్నాయి.

ఇంకో జత తీసాను. అదీ అంతే ఉంది. ఇలాంటి బట్ట లేసుకుని బయటికి వస్తే ఏ హంతకుడో అనుకుంటారు.

నా బుర్ర తిరిగిపోసాగింది.

విడిచిన బట్టలే తొడుక్కుని ఆ బట్టలన్నీ ఓపిగ్గా ఉతుక్కున్నాను.

వంటింట్లో కొచ్చి నేను తెచ్చిన బ్రెడ్డూ పళ్ళూ తీసాను.

ఈ సారెందుకో నాకు నవ్వొచ్చింది.

బ్రెడ్డూ పళ్ళూ కూడా సగం ఉన్నాయి.

ఈ లెఖ్ఖన చూస్తే దెయ్యం మంచిదే అనిపించింది.

ఎంతైనా ఆడ దెయ్యం కదా!

దానికి దయా, జాలి పుట్టుకతో వచ్చేవి చచ్చినా పోనటువంటివి అన్నమాట.

తిండి తిన్నాక శక్తి వచ్చింది.

ధైర్యమూ వచ్చింది.

అందుకే ,దెయ్యాన్ని అడిగాను చేతులు జోడించి.... "ఓ దయ్యమా! నువ్వు చాలా మంచిదానిలాగ ఉన్నావు. అందుకే నాకేహానీ చెయ్యలేదు. సాయం చేసి నాకు స్నేహితురాలివైపోవా ప్లీజ్!?

ఇంతకీ నాకు నువ్వు చేసే సాయమేమిటో తెలుసా?

నాకు బాగా డబ్బున్న పిల్లతో బోలెడు కట్నంతో పెళ్ళి జరిగేటట్టు చూడు. అందం చదువుల పట్టింపు లేదు. అయినా దయ్యమా నువ్వెందుకు ఉరి పోసుకున్నావు? మీ ఆయన నీ వంట బాగులేదన్నాడా? లేక మీ అత్తగారు నీకంటె తన కూతురే అందమైంది అని అన్నదా? ఇలాంటి సిల్లీ కారణాల వల్లే కదా ఈ మధ్య ఆడవాళ్ళు ఉరిపోసు కుంటున్నది!"

ఎందుకో కానీ దయ్యం నా మాటలన్నీ వింటున్నట్టు అనిపించింది. కానీ ఎందుకో బయట పడడం లేదు. ఇంకాస్సేపు ఆట పట్టిస్తే రావడం తథ్యం అనుకుంటూ పొడిగించాను.

"నా పెళ్లాం నేను అడిగినప్పుడల్లా డబ్బు తెచ్చేలాగ చూడు. తేలేని స్థితికొస్తే ఉరిపోసుకునేలాగ చూడు. హాయిగా నేను ఇంకో కట్నం తెచ్చే పిల్లని చేసుకుంటాను. నా మొదటి భార్యకి మాత్రం కష్టం ఏముంది? నీలాగ హాయిగా దయ్యమై తిరుగుతుంది. ఓ ఇంటిని పట్టుకుని వేళ్లాడుతుంది."

"స్టాప్‌యిట్" ఇల్లంతా దద్దరిల్లేటట్టుగా అరుపు వినిపించింది.

"ఎంత ధైర్యం నీకు ఇలా మాట్లాడడానికి? ఆడదంటే ఇంత చులకనా? నిన్ను కన్నది, పెంచినది ఆడది కాదా? నిన్ను కట్టుకుని చచ్చేదాకా ఊడిగం చేసేది ఆడది కాదా! ఆ ఆడదంటే ఎందుకంత హీనభావం?" ఆవేశంగా అంటూ వచ్చింది ఓ ఆడది. అది దయ్యం మాత్రం కాదు. అందమైన ఆడపిల్ల.

నేను ఆశ్చర్యంగా చూస్తూండి పోయాను. ఆ అమ్మాయి చెప్పసాగింది.

"అందమైన మా అక్కకి మంచి కట్నంతో పెళ్ళైంది. కానీ పెళ్ళయ్యాక అత్తారింట్లో అంతా దాన్ని అష్టకష్టాలు పెట్టారు. అవన్నీ నాకు వచ్చినప్పుడల్లా చెప్పేది. అమ్మా నాన్నలకి కూడా ఒకటి రెండుసార్లు చెప్పాలని చూసింది. కానీ వాళ్ళు వినిపించుకో లేదు. ప్రతీ యింట్లోనూ ఏదో ఓ సమస్య ఉంటుంది. సర్దుకు పోవాలి అనేవారు వాళ్ళు.

అసలది మా ఇంటికి వచ్చేదేమో బావా వాళ్ళూ తెమ్మన్న డబ్బు తీసుకు పోవడానికి.

నాన్న స్థితి దిగజార సాగింది. ఇంకా పెళ్ళికి నేనూ ఉన్నాను.

అందుకే ఇంక ఇవ్వలేనన్నారు.



# పుస్తకాల పేజీ

## పోలీసు వెంకటస్వామి కథలు

కథల సంపుటం. రచన: సూరత్తు వేణుగోపాలరావు, ప్రతులకు: సురక్ష పబ్లికేషన్సు, 'సురక్ష' కార్యాలయము, లక్డీ-కా- పూల్, హైదరాబాద్-500 004. పుటలు 183. వెల: రు. 30/-.

శ్రీ సూరత్తు వేణుగోపాలరావు పదవీ విరమణ తర్వాత కూడా తమ డిపార్టుమెంటును మరచిపోకుండా పోలీస్ ఉద్యోగుల సంక్షేమం కోసం స్వలాభాపేక్ష లేకుండా పోలీసు శాఖలో తన కెదురైన అనుభవాలను క్రోడీకరించి చక్కని హాస్యాన్ని కలబోసి అందించిన అత్యుత్తమ క్రైం కథల సంపుటం "పోలీసు వెంకటస్వామి కథలు" ఒక ఉత్తమ పోలీసుకి వుండాల్సిన లక్షణాలన్నీ రచయిత పోలీస్ వెంకటస్వామిలో చిత్రీకరించారు.

'దొంగ దొంగ' అన్న కథలో వెంకటస్వామి తప్పుడు ఫిర్యాదు చేయ వచ్చిన చలమయ్యను ముప్పుతిప్పలు పెట్టి అతని బ్రతుకు బండారం చేసి పై అధికారి ఆదరాభిమానాల్ని చూరగొన్న వైనం అత్యద్భుతంగా వుంది. పోలీసు శాఖలో వెంకటస్వామి లాంటి ఒక్క పోలీసు వున్నా చాలు ఆ శాఖ పూజ పుష్కలమైనట్లే.

ఏ వ్యవస్థలో అయినా దుర్మార్గులు కొందరు వుంటారు. అటువంటి వారిని నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయటమే కర్తవ్యం అని తెలియ చెప్పే కథ 'సుందరీ కాండ'. దీనిలో ఒక పోలీసాఫీసరే సుందరీ అనే ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకొని పరిస్థితి విషమిస్తున్న సమయంలో రెండో కంటికి తెలియకుండా ఆమెని మట్టు పెట్టిన విషయం వెంకటస్వామి అతి సునాయాసంగా కనిపెట్టి హంతకుని (పోలీసాఫీసరుని) డిపార్టుమెంటుకు పట్టిస్తాడు. ఇలాగే "శకటాసుర మర్దనం"లో గంజాయి దొంగ వ్యాపారి తులసీ దాసుని తన సునిశిత పరిశీలనా శక్తితో పట్టి డిపార్టుమెంట్‌కి వప్పగిస్తాడు.

ఈ సంపుటంలోని 15 కథలలో పోలీసు వెంకటస్వామి తనపై ఆఫీసరుకి ఎలా తోడ్పడిందీ విశదమవుతుంది. నిజంగా పోలీసు వెంకటస్వామి లాంటి వ్యక్తి తన అసిస్టెంట్‌గా దొరకడం ఆఫీసరు పూర్వజన్మ సుకృతం.

అతని భారీ కాయం ఆఫీసరుకి వెగటనిపించినా అతని సునిశితాదృష్టి ఆఫీసరుని ఆకర్షించింది. పైపెచ్చు అతను ఆఫీసరుకి విధేయుడు, విశ్వాసపాత్రుడు. వెంకటస్వామి జ్ఞానం, అనుభవం వున్నవాడయినా కొంచెం మొండివాడు. అతని మొండితనం, సామెతలంటే అతనికి వున్న ప్రీతి అతని వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దాయి.

సాహిత్యంలోను, సినిమాలలోనూ కూడా పోలీసులను అసమర్థులుగా చిత్రిస్తున్నారు. అందుకే పోలీసులు ప్రజలను కాపాడే రక్షకులుగా తమ విధులను చిత్తశుద్ధితో నెరవేర్చినప్పుడే వారికి తగిన గుర్తింపు, సంఘంలో ఒక స్థానం ఏర్పడతాయి అంటారు రచయిత. ఏది ఏమైనా ప్రతి పోలీసు ఒక వెంకటస్వామి అయితే ప్రజలకి అంతకన్నా కావలసినదేముంది?

## కళ్యాణ రాఘవము

కవి : శ్రీ చిలుకమర్తి రామానుజాచార్యులు, పుటలు : 50, వెల : 5 రూపాయలు, ప్రతులకు : పింగళి- కాటూరి సాహిత్య పీఠం, కేర్/ఆఫ్ మాధవీ ప్రింటర్స్, కుత్బిగూడ, హైదరాబాద్-500027.

## వేదాంత వ్యాస చంద్రిక

రచన : శ్రీ కొరిగే సుధాకరరావు, పుటలు : 110, వెల : 20 రూపాయలు, ప్రతులకు : కె. సుధాకరరావు, కేర్ కె. తిమ్మాజీరావు, 3/351, సదాశివపేట, ఆదోని-518301, కర్నూల్ జిల్లా (ఆం.ప్ర).

## ★ శ్రీసూక్త పూజా విధానము

గ్రంథకర్త: బ్రహ్మశ్రీ గోదావరి అచ్చయ్యశాస్త్రి, పుటలు : 36, వెల : ఐదు రూపాయలు, ప్రతులకు: గోదావరి అచ్చయ్యశాస్త్రి, వేట్లపాలెం (తూర్పు గోదావరి జిల్లా).



ఇటీవల నాగపూర్‌లో వున్న బెంగాలీ సాహిత్య జర్నల్ 'ఖన్నన్' సాహిత్య సమావేశం నిర్వహించిన సందర్భంగా సమావేశమయిన వివిధ భాషా రచయితల మధ్య జాగృతీ కిరణ్.

## కన్నె దెయ్యం

"నాన్నివ్వకపోతే వాళ్ళు నన్ను తగలపెట్టేస్తారే" అంది ఏడుస్తూ. నేనూ ఏం చెయ్యలేని పరిస్థితది.

ఆ తర్వాత అక్క చనిపోయింది.

వాళ్ళ చేతుల్లో చావడమెందుకని తనే ఉరిపోసుకుందో లేక వాళ్ళే ఆ పని చేయించారో! నిజంగా వాళ్ళే చంపినా లేక వాళ్ళు చంపకపోయినా హంతకులు మాత్రం వాళ్ళే. వాళ్ళు చంపకపోయినా మా అక్కని ఆ స్థితికి పురికొల్పింది వాళ్ళే కదా. కానీ సాక్ష్యాధారాలేవీ లేక ఏ శిక్షా పడలేదు వాళ్ళకి. అక్క కోసం కల్లబొల్లిగా ఓ ఏడుపు ఏడ్చి అక్కలేని లోటు తీర్చేందుకు అక్కలాగే ఉన్న నన్ను చేసుకుంటానన్నాడు బావ.

పాడి ఆవులాంటిదాన్ని కదా నేను బంగారు ఉద్యోగంలో ఉన్నందుకు. అమ్మా నాన్నా తల ఊపారు.

అప్పుడు నేను కోపంగా ఇల్లు వదిలేసాను.

అక్కనిలాగ చేసిన వాళ్ళపై పగ తీర్చుకునేందుకు వాళ్ళదైన ఈ ఇంట్లో దెయ్యం ఉందని కథ అల్లాను. వాళ్ళే ఈ ఇంట్లోంచి పారిపోయేలాగ చేసాను. అక్క భయంకరంగా చనిపోయిన ఈ ఇంట్లో ఎవ్వరూ ఉండకూడదనుకుని ఇలా చేస్తున్నాను.

నీ మాటలు వింటుంటే నిజంగా నాకు దేముడ్ని ఓ కోరిక కోరాలనుంది.

ఓ దేముడా! నువ్వు పక్షపాతివి. స్త్రీని ఎన్ని విధాల కష్టపెట్ట గలవో ఎన్నోసార్లు ఋజువు చేస్తూ వచ్చావు. నీ ఆ పనిని ఆపమని నేనడగను. ఎందుకంటే ఆ పని చెయ్యకుండా నువ్వుండలేవు.

నేనడిగేది ఒక్కటే. పెళ్ళయ్యాక చంపబడే ఆడపిల్లలందర్నీ దెయ్యాలను చెయ్యి. ఆ ఆడదెయ్యాలైనా తమ తమ పగలను చల్లార్చుకునేలాగ చెయ్యి.

కనీసం అప్పటికైనా ఈ పురుష ప్రపంచంలో స్త్రీ ధైర్యంగా బ్రతక గల్గుతుందేమో!" ఆవేశంగా ఊగిపోతూ అంది. ఆ అమ్మాయి దెయ్యాల కథలకి ఫుల్‌స్టాప్ పెట్టద్దని (పరోక్షంగా) భగవంతుడ్ని కోరుకుంటూ!